క్లుప్తంగా

అన్నదాత పోరుకు వెళ్లకుండా చెక్ పోస్టు



యండకుదురు(ఘంటసాల): రైతన్నలకు అండగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన అన్నదాత పోరుకు ఆ పార్టీ నాయకులు, రైతులు వెళ్లకుండా 216 జాతీయ రహదారి వెంబడి ఉన్న ఘంటసాల మండలం యండకుదురు వద్ద పోలీసులు చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. మచిలీపట్నం వెళ్లే అన్ని వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, రైతులను అడ్డుకునేందుకు ఎంత ప్రయత్నించినా కూడా పార్టీ శ్రేణులు మచిలీపట్నం వెళ్లారు. అయితే ఘంటసాల మండలంలో ప్రధాన నేతలకు సోమవారం రాత్రే పోలీసుల నుంచి అనుమతి లేదు వెళ్లొద్దని సమాచారం ఇచ్చినట్లు పలువులు నేతలు తెలిపారు.

అలరించిన హరికథా గానం



నాగాయలంక: స్థానిక వినాయక నవరాత్రి ఉత్సవ వేదికపై మంగళవారం నిర్వహించిన బ్రహ్మంగారి జీవిత చరిత్ర హరికథా గానం అలరించింది. మాదివాడ రామకృష్ణ ఆర్థిక సౌజన్యంతో ఏలూరుకు చెందిన ఎస్.భారతి భాగవతారిణి గానం చేసిన హరికథ ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. విద్వాన్ బ్రహ్మశ్రీ పాపర్తి ఆంజనేయులు (అవనిగడ్డ) వయోలిన్, విద్వాన్ ఎం.నగధరరావు(తెనాలి) మృదంగ సహకారం అందించారు. అంతకుముందు స్థానిక సంకర్షణ భజన మండలి సభ్యులచే 11సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. ప్రసన్న గణపతి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో అంబా సాయి కిరణ్‌శర్మ (కౌశిక్) బ్రహ్మత్వంలో శ్రీలక్ష్మీ గణపతి హోమం జరిగింది.

ఘనంగా మరియమాత జన్మదిన వేడుకలు



పెడన: పట్టణంలోని తోటమూల ఆర్‌సీఎం చర్చిలో సోమవారం అర్ధరాత్రి మరియమాత జన్మదిన వేడులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండం ఫాదర్ ఎస్.జోజప్ప ఆధ్వర్యాన వివిధ విచారణ గురువులతో కలసి మరియమాత తేరు(రథం) ఊరేగింపు నిర్వహించారు. దివ్యబలిపూజ కార్యక్రమంలో భాగంగా విచారణ గురువులు జాన్ డీ కృజ్, జాకోబ్ ప్రసాద్‌లు మరియ మాత జన్మదిన విశేషాలతో సంఘస్తులకు వాక్యార్పన చేశారు. అనంతరం కేక్ కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పలు సంఘాల పెద్దలు, ప్రేమాంజలి సిస్టర్స్, మరియదళ సభ్యులు ఉప్లా, విన్సెంట్‌పాల్, సిలువ వెలుగు యూత్, సంఘస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ అభివృద్ధి పనులు ప్రారంభం



పెడన: పట్టణ పరిధిలో చేపట్టిన విద్యుత్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాదు మంగళవారం ప్రారంభించారు. పట్టణంలోని రాజీవ్‌నగర్, కట్లపల్లి, కానూరు వీవర్సు కాలనీ, మెట్ల జోగానందరావు కాలనీ, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో దీర్ఘకాలంగా ఉన్న లోఓల్టేజి సమస్య పరిష్కారానికి రూ. 30 లక్షల నిధులు కేటాయించి పనులు పూర్తి చేసి ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తోటమూల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు భాస్కర్, గోవిందరావు, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కృత్తివెన్ను: కృత్తివెన్ను మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు కార్యాలయ సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు అన్ని శాఖల మండలాధికారులు హాజరుకావాలని సూచించారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న సింహాద్రి రమేష్, పేర్ని కిట్టు, ఉప్పాల రాము, నాయకులు



ప్లకార్డులతో కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు, కార్యకర్తలు

అన్నదాత ఆగ్రహ జ్వాల

- రైతన్నను ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు
- ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్న నాయకులు, రైతులు
- అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులు
- పోలీసులకు, నాయకులు, రైతులకు మధ్య తోపులాట



మచిలీపట్నంలో నాయకులు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

చిలకలపూడి(మచిలీపట్నం)/మచిలీపట్నంఅర్బన్/కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు అండగా ఉండేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాలకు చెందిన నాయకులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సకాలంలో ఎరువులు అందకపోవడంతో పంట ఏమైపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వారి కష్టాలను పాలకులు, అధికారులకు తెలియజెప్పాలని అన్నదాత పోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది రైతులు పాల్గొని నినాదాలతో హోరెత్తించారు. మచిలీపట్నం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం శాంతియుతంగా ర్యాలీ చేపట్టి ధర్నా చౌక్ వద్దకు చేరుకున్నారు. తమ కష్టాలను ఉన్నతాధికారులకు తెలుపుకొనేందుకు కలెక్టరేట్‌కు వెళ్లడానికి రైతులు సమాయత్తమవ్వడంతో పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, రైతులకు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం, తోపులాట జరిగింది. అనంతరం కొద్ది మందిని అనుమతించడంతో ఆర్డీవో ఎ.స్వాతికి వైఎస్సార్ సీపీ నేతలు, రైతులు వినతిపత్రం అందజేశారు.

రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వం

అన్నదాత పోరు కార్యక్రమంలో అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ ఎరువుల కోసం రైతులు పడుతున్న కష్టాలు కూటమి ప్రభుత్వం అనుకూల పత్రికల్లో కూడా వచ్చినప్పటికీ ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కావాలని కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు పాలకులు సహకరిస్తున్నారన్నారు. రైతాంగాన్ని ఆదుకోండని వారి గళంగా చెప్పడానికి వస్తే దీనికి కూడా కేసులు పెట్టేందుకు ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మాట్లాడుతూ ఎరువుల వాడకం ద్వారా పండిన అన్నం తింటే క్యాన్సర్ వస్తుందని సీఎం చంద్రబాబునాయుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. పెడన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉప్పాల రాము మాట్లాడుతూ రైతుల ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ప్రయత్నం చేస్తుంటే కేసులతో నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్క రైతు కూడా రోడ్డెక్కలేదని గుర్తుచేశారు. ఆర్బీకేల ద్వారా రైతు ముంగిటకే అన్ని రకాల సేవలు తెచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మాదు శివరామకృష్ణ, పార్టీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు తిరుమాని శ్రీనివాసరావు, కృత్తివెన్ను జెడ్పీటీసీ సభ్యుడు మైలా రత్నకుమారి, ఎంపీపీ సంగా మధుసూదనరావు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోతున్నాయి



ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియా అందించలేకపోతోంది. ఎకరానికి 150 కిలోలు అవసరం. మా పీఏసీఎస్ పరిధిలో మూడు గ్రామాలు, 3,500 ఎకరాల సాగు జరుగుతున్నా కేవలం 880 కట్టలు మాత్రమే వచ్చాయి. ఎరువులు అందక పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి వచ్చింది.

– ఎం.కోటిలింగేశ్వరరావు, సీతారామపురం, బందరు మండలం

ప్రభుత్వ వైఫల్యం



పంట బాగుంటేనే రైతు బతుకుతాడు. ఎరువులు లేకుండా ఎలా పంట పండించుకుంటాం. అధికారుల నిర్లక్ష్యంతో రైతులను కష్టాల్లోకి నెట్టేశారు. ఈ పరిస్థితి చూడగానే ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. రైతుల గళం విన్నా విననట్లుగానే వ్యవహరిస్తున్నారే తప్ప యూరియా కష్టాలు తీర్చడం లేదు.

– జంపాన భానుశేషులు, రామానుజవత్తర్లపల్లి, గూడూరు మండలం

ఇదేనా సుపరిపాలన అంటే



రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఎరువులు అందించక రైతులను కష్టాల్లోకి నెట్టేసింది. యూరియా కోసం ప్రతిరోజు సొసైటీ చుట్టూ తిరుగుతున్నా ఒక్క కట్ట కూడా దొరకడం లేదు. ఒక కట్ట కూడా రైతుకు ఇవ్వలేకపోవడమేనా సుపరిపాలన అంటే. కూటమి ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులను ఇబ్బందుల్లోకి నెట్టేసింది.

– కూనపరెడ్డి కాళికారావు, బుద్దాలపాలెం, బందరు మండలం

కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

మచిలీపట్నంటౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరపాలకసంస్థ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు ఏఐటీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు మోదుమూడి రామారావు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ జీతాలు, పీఎఫ్ బకాయిలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకుడు వై.ఈశ్వరరావు పాల్గొన్నారు.

అరకొరగా యూరియా సరఫరా



ఘంటసాల: రైతులకు యూరియా కొరతలేదు వైఎస్సార్ సీపీ దుష్ప్రచారం చేస్తుందంటూ కూటమి ప్రభుత్వం ఆర్భాట ప్రచారమే తప్ప క్షేత్రస్థాయిలో రైతులకు యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఘంటసాల శ్రీజలదీశ్వర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి మంగళవారం 40 టన్నుల యూరియా వచ్చినట్లు కార్యదర్శి తెలిపారు. దీంతో ఘంటసాల, చిలకలపూడి, తదితర గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున వచ్చారు. 345 మంది రైతులకు టోకెన్లు ఇచ్చి యూరియా అయిపోయిందని చెప్పడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉన్న కొంతమంది రైతులకు యూరియా అందలేదు. దీంతోపాటు మరికొంత మందికి అరకొర యూరియా ఇవ్వడంతో అధికారుల తీరుపై మండిపడ్డారు.

దివిసీమలో వర్షం

అవనిగడ్డ: మోపిదేవి, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లోని పలు ప్రాంతాల్లో మంగళవారం వర్షం కురిసింది. గంటపాటు కురిసిన ఈ వర్షం వల్ల వరి పొలాలకు సాగునీటి ఇబ్బందులను తొలగించిందని రైతులు చెబుతున్నారు. దివిసీమలో కొన్నిచోట్ల వరిపొలాలకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పిలక తొడిగే దశ, చిరుపొట్ట దశలో వరి పొలాలు ఉన్నాయి. ఈ సమయంలో కురిసిన వర్షం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాత పోరుకు తరలివెళ్లిన నేతలు

అవనిగడ్డ: రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం మచిలీపట్నంలో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి పార్టీ నాయకులు, రైతులు అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ చింతలపూడి వెంకటేశ్వరరావు, పార్టీ పంచాయితీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జయగోపాల్, నాయకులు బాలు, మద్ది చిన్నా, కార్యకర్తలు వెళ్లారు.

పెడన నుంచి..

పెడన: వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు మండలాల నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు ర్యాలీగా మచిలీపట్నం తరలివెళ్లారు. ఎంపీపీ ఎస్.మదుసూధన్‌రావు, జెడ్పీటీసీలు ఎం. రత్నకుమారి, సురేష్‌రంగబాబు, జిల్లా రైతు విభాగం కన్వీనర్ టి.శ్రీనివాసరావు, నాయకులు జి.రామానాయుడు, పి.మహేష్, వి.విశ్వేశ్వరరావు, పుష్ప, కార్యకర్తలు తరలివెళ్లారు.



పెడన నుంచి తరలివెళుతున్న ఉప్పాల రాము, వైఎస్సార్ సీపీ శ్రేణులు

వివాదాస్పద స్థలం పరిశీలించిన ఆర్డీఓ

బంటుమిల్లి: మండలంలోని రామవరపుమోడి – పల్లికొండవారిమోడి గ్రామాల మధ్య సరిహద్దు పొలిమేర సమస్య తలెత్తి ఇరువర్గాల మధ్య వివాదానికి కారణమైంది. ఈ వివాదం పరిష్కారం నిమిత్తం ఆర్డీఓ స్వాతి మంగళవారం బందరు డీఎస్పీ సీహెచ్. రాజాతో కలసి వివాదస్పద స్థలాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. రామవరపుమోడి గ్రామంలో బుధవారం నుంచి గంగానమ్మ జాతర ప్రారంభం కానుంది. అయితే రెండు గ్రామాల సరిహద్దు పొలిమేరలో పోతురాజు కొమ్ములు దిమ్మె ఏర్పాటు చేసి సుమారు 50 ఏళ్లకు పైగా అవుతోంది. ఇక్కడ నుంచే జాతర ఉత్సవాలు మొదలవుతాయి. ఈ స్థితిలో కొమ్ములుపాతిన దిమ్మె పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పల్లికొండవారి మోడి గ్రామానికి చెందిన పైడెయ్య అనే వ్యక్తి ఆక్రమించి బడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. దీంతో అతనికి, గ్రామస్తులకు వివాదం తలెత్తింది. దీనిపై ఆర్డీఓ, డీఎస్పీలు జాతర ప్రశాంతంగా జరిగేందుకు ఎటువంటి వివాదాలకు తావులేకుండా రాజీ చేసి ఇరు వర్గాల వద్ద నుంచి హామీలు తీసుకున్నారు. తహసీల్దార్ కేవీ పూర్ణచంద్రరావు, పెడన సీఐ నాగేంద్రప్రసాదు, ఎస్ఐ గణేష్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మోపిదేవి: మండలంలో పనిచేసిన ఉత్తమ ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులకు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సన్మానం నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కోసూరువారిపాలెం ప్రాథమిక పాఠశాల టీచర్ తుంగల చంద్రశేఖరరావు, జిల్లా మెటోరియల్ సర్వీస్ అవార్డు పొందిన మోపిదేవి జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం పోలవరపు జయంతిని ఉపాధ్యాయ బృందం సత్కరించారు. అలాగే విశ్రాంత ఉపాధ్యాయులు వి.కోటేశ్వరమ్మ, జీఎస్ బాబు, కె.మోహనరావు, అడపా గురవయ్య, కె.ఉమామహేశ్వరావు, కె.అనూరాధ, సుబ్రహ్మణ్యం, బి.సాంబశివరావులను కూడా సత్కరించారు. ఎంపీపీ రావి దుర్గావాణి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు నడకుదుటి జనసీకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జునరావు, గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, ఎంఈవో–1 బి.గోపాల్, ఎంఈవో–2 వెంకటరమణ పాల్గొన్నారు.

అవనిగడ్డ: ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న తుంగల చంద్రశేఖర్, డాక్టర్ కొమ్మినేని ఉదయ్‌కుమార్‌ని స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీవో మరియాదేవి, ఎంఈవోలు ఎస్.శివశంకర్, అన్నపరెడ్డి పిచ్చయ్య, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు ఇద్దరు ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి మెమొంటోలు అందించారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, ఎంపీటీసీలు బొప్పన భాను, కటికల వసంత్, తుంగల బాలాజీ పాల్గొన్నారు.



మోపిదేవిలో ఉపాధ్యాయులను సన్మానించిన ప్రజాప్రతినిధులు

అధికారులు అందుబాటులో ఉండాలి

మోపిదేవి: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అందించాలని తహసీల్దార్ ఎం.హరనాథ్ సూచించారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యాన ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, లైన్ డిపార్ట్‌మెంట్స్, రెవెన్యూ, అగ్రికల్చర్, హార్టీ కల్చర్, పశుసంవర్ధక, పౌర సరఫరా, విపత్తు నిర్వహణ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, గృహనిర్మాణ, మహిళా శిశు సంక్షేమ, విద్యాశాఖ, సాంఘిక సంక్షేమశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గూడూరు: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా బుధవారం ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మచిలీపట్నం ఈఈ జి.గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా మల్లవోలు, ముత్రాసిపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వరి సాగుకు స్థూల పోషకాలు అవసరం

మోపిదేవి: వరిసాగులో స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మధాతు పోషకాలు ఇనుము, జింకు అవసరమని కేవీకే ఘంటసాల వ్యవసాయ శాస్త్రవేత్తలు వెంకటలక్ష్మి, రేవతి పేర్కొన్నారు. మండల కేంద్రం మోపిదేవి, వెంకటాపురం, అన్నవరం గ్రామాల్లో మంగళవారం వారు వరి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నత్రజని పోషకాన్ని డీఏపీ రూపంలో అందించి, యూరియా వినియోగాన్ని తగ్గించుకుని వాడుకోవాలని వివరించారు. మండల ఏఓ కె. హెప్సిబారాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతి సూచికపై శిక్షణ

నాగాయలంక: పంచాయతీల పురోగతి సూచిక – 2.0పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.ఎం. చంద్రశేఖర్ నేతృత్వంలో జరిగిన శిక్షణకు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి ఉద్యోగులు, గ్రామ కార్యదర్శులు హాజరయ్యారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి అంశాలపై పలువురు అధికారులు వారికి శిక్షణ ఇచ్చారు. డెప్యూటీ తహసీల్దార్ మండలి కేశవి, సర్పంచ్‌లు మండలి ఉదయభాస్కర్, అంబటి శ్యామ్‌ప్రసాద్, మండల సర్వేయర్, అధికారులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు: గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులకు అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్, ట్రాన్సిషన్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో కె.వి.రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణలో వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఈఓపీఆర్డీ బి.రాజేశ్వరి, ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

ఘంటసాల: ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పీఏఐ 2.0 శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో కె.జె. శ్రీనివాస చంద్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. మండలంలోని 22 గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

పెడన: వరిలో వచ్చే చీడపీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాస్త్రవేతలు సూచించారు. మండలంలోని గురివిందగుంట గ్రామంలో మంగళవారం పంట పొలాలను పరిశీలించారు. మచిలీపట్నం జిల్లా రీసర్చ్ సెంటర్ డీడీ జ్యోతిరమణి, ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓలు పద్మజ, జెన్నీలు రైతులకు పలు సూచనలు చేసి వారి సందేహాలను నివృత్తి చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచనల మేరకు పురుగు మందులు పిచికారి చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. కార్యక్రమంలో వీఏఏ మధు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈఈగా పాండురంగారావు

బంటుమిల్లి: మండల విద్యుత్ ఏఈఈగా కొతరపు పాండురంగారావు మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన పెడన నుంచి ప్రమోషన్‌పై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రవికుమార్ విజయవాడ కృష్ణలంక సబ్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

కరాటే పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.యోషిత కరాటే పోటీల్లో ప్రతిభ చాటి ప్రథమ స్థానం దక్కించుకుంది. ప్రకాశం జిల్లా, ఉప్పుకొండూరు ఆక్స్‌ఫర్డు హైస్కూల్లో ఈనెల 7వ తేదీన సిలంబం అసోసియేషన్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో పాల్గొన్న యోషిత ప్రథమ స్థానం పొంది మెడల్, సర్టిఫికెటు అందుకుంది. కరాటే మాస్టరు ఎస్.వెంకటేశ్వరరావు, యోషితను పాఠశాల డైరెక్టరు కె.కిషోర్, కరస్పాండెంట్ శోభ, హెచ్‌ఎం ఎస్. శ్రీనివాసరావు అభినందించారు.

ధూమపాన నష్టాలపై అవగాహన ర్యాలీ

మోపిదేవి: ధూమపానం వల్ల వచ్చే నష్టాలను వివరించి, వాటిని అరికట్టాలని అలాంటి చెడు అలవాట్లుకు విద్యార్థులు, ప్రజలు దూరంగా ఉండాలని ఎంపీపీ రావి దుర్గవాణి పేర్కొన్నారు. పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ, మోపిదేవి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు మంగళవారం పాఠశాల నుంచి స్థానిక బస్టాండ్, గుడిసెంటర్ వరకు ప్లెక్సీలతో ధూమపాన వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు.